సాక్షి అనంతపురం

శనివారం । 21 । జూన్ । 2025



చీనీ టన్ను రూ.26,770

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.26,770 పలికాయి.



దగా పడిన వరి రైతులు

వరిధాన్యం అమ్మి రెండు నెలలైనా ప్రభుత్వం నగదు చెల్లించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 8లో



జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

అప్‌డేషన్‌లో ఇబ్బంది రాకూడదు

అనంతపురం అర్బన్: ఎన్‌పీసీఐ, ఈ–కేవైసీ, తదితర అప్‌డేషన్ ప్రక్రియలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. అప్‌డేషన్ ప్రక్రియపై కలెక్టర్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అప్‌డేషన్ కోసం బ్యాంకులు, పోస్టాఫీసుకు వస్తున్న పిల్లలు, తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, రద్దీకి ఆస్కారమివ్వకుండా చూడాలన్నారు. అవసరమైతే అదనపు సమయం కేటాయించాలని ఆదేశించారు. బ్యాంకులు, పోస్టాఫీసులను లీడ్ బ్యాంక్ మేనేజర్ తనిఖీ చేస్తూ సమస్యలు రాకుండా చూడాలన్నారు.

సీఐ జయనాయక్‌పై చర్య తీసుకోండి

- రాష్ట్రపతి, గవర్నర్, డీజీపీ, హోం మంత్రికి ఫిర్యాదు

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాయదుర్గం అర్బన్ సీఐ జయనాయక్ వేధింపుల నుంచి తమకు రక్షణ కల్పించాలని రాయదుర్గం మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడొకరు రాష్ట్రపతి, గవర్నర్, డీజీపీ, హోం మంత్రి, ఎస్పీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆ వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి తమపై పోలీసు వేధింపులు ఎక్కువయ్యాయని పేర్కొన్నారు. సీఐ జయనాయక్ ఇటీవల పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఇష్టమొచ్చినట్లు బూతులు తిట్టడమే కాకుండా 'నీపై హత్యకేసు నమోదుచేస్తాన'ంటూ బెదిరించారని ఆరోపించారు. 2019లో జరిగిన ఓ కేసుతో తనకు సంబంధం లేకున్నా ఇరికించే కుట్రలు చేస్తున్నారని ఆవేదన చెందారు. చీటికీమాటికీ పోలీసులను పంపడం, ఫోన్ చేసి ఇబ్బందులకు గురిచేస్తుండడంతో భరించలేక ఊరొదిలి దూరంగా వెళ్లినా ఇబ్బందులు తప్పలేదన్నారు. ఉన్నతాధికారులు తనకు న్యాయం చేయకపోతే కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకోవడం మినహా మరో మార్గం లేదని వాపోయారు.

'ఉపాధి' పనుల పరిశీలన



కొడిమి జర్నలిస్టు కాలనీ రోడ్డు కొలతలను పరిశీలిస్తున్న అధికారులు


అనంతపురం సిటీ: ఉపాధి హామీ పథకం కింద జిల్లా వ్యాప్తంగా చేసిన, చేస్తున్న వివిధ రకాల అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మినిస్టీరియల్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ నుంచి ప్రోగ్రాం ఆఫీసర్‌గా నబనీతదాస్ నేతృత్వంలో ప్రత్యేక బృందం క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తోంది. బృందంలో పంచాయతీరాజ్ శాఖ రిటైర్డ్ ఈఎన్‌సీ రామ్మూర్తి, నాబార్డు కన్సల్టెంట్ హెడ్ సీఎస్ వెంకటేశ్వరరావ్, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ అడిషనల్ కమిషనర్ శివప్రసాద్ ఉన్నారు. ఈ బృందం శుక్రవారం వివిధ ప్రాంతాల్లో పర్యటించింది. పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం కొడిమి గ్రామంలో పర్యటించింది. అక్కడ తారు రోడ్డు, డ్రెయినేజీ పనులను పరిశీలించింది. వాటి నాణ్యతను పరీక్షించింది. అక్కడి నుంచి భైరవనగర్, ఆదర్శనగర్ ఎక్స్‌టెన్షన్ కాలనీలోని రోడ్లను, ఫారంపాండ్లను పరిశీలించింది. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నిర్మాణాలు చేపట్టారా లేదా అని కొలతలు కూడా తీసింది. వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మించిన పనులతో పాటు ప్రస్తుతం జరుగుతున్న పనులనూ ఈ బృందం చూసింది. పనులు నాణ్యతగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేసింది. డీఈఈ కె.లక్ష్మీనారాయణ సహా ఏఈ వెంకటేశప్పయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కులశేఖర్‌రెడ్డి, ఇతర సిబ్బందిని ప్రత్యేక బృందం అభినందించింది. కార్యక్రమంలో ఎంపీడీఓ దివాకర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజెంటింగ్ అధికారి నియామకం

అనంతపురం అర్బన్: అవినీతి కేసులో ఒక వీఆర్‌ఓ, డిప్యూటీ తహసీల్దారు, ఆర్‌ఐపై నమోదైన చార్జెస్‌పై విచారణ అధికారి ముందు వివరించేందుకు ప్రజెంటింగ్ అధికారిని ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించి జీఓ 619ను శుక్రవారం జారీ చేశారు. రాప్తాడు మండలం గాండ్లపర్తి వీఆర్‌ఓ కె.నరసింహులు పట్టాదారు పాసుపుస్తకం ఇచ్చేందుకు యాలేటి ప్రదీప్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తి నుంచి రూ.4 వేలు లంచం తీసుకుంటూ 2023 ఫిబ్రవరి 21న ఏసీబీకి పట్టుబడ్డాడు. ఆయన ద్వారా తీసుకున్న స్టేట్‌మెంట్‌లో రాప్తాడు డిప్యూటీ తహసీల్దారు టి.లక్ష్మీనరసింహులు, ఆర్‌ఐ జీసీ హేమావతిపైనా చార్జెస్ ఫ్రేమ్ చేశారు. ఈ చార్జెస్‌పై సంబంధిత విచారణ అధికారికి వివరించేందుకు అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్ జయమ్మను ప్రజెంటింగ్ అధికారిగా ప్రభుత్వం నియమించింది.

ఆదాయం ఆవిరి

2024 ఏప్రిల్‌లో రాప్తాడుకు చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారానికి వచ్చారు. 'ఇక్కడ పొలాల్లోనే రైతులు కరెంటు ఉత్పత్తి చేసేలా చేసి, మిగులు కరెంటు ప్రభుత్వానికే అమ్మేలా చేస్తా' అన్నారు. కానీ ఈరోజు చూస్తే కరెంటు ఉత్పత్తి దేవుడెరుగు కరెంటు కోతలు ఇబ్బంది పెడుతున్నాయి. ఇళ్లకొచ్చే కరెంటు బిల్లులు చూసి సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు.



- సంపద సృష్టి కాదు ఆదాయం లేక అప్పులు చేస్తున్న దుస్థితి
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో భారీగా పడిపోయిన చిన్న మార్కెట్లు
- పంటలకు గిట్టు బాటు ధరలు లేక రైతులకు భారీగా నష్టాలు
- జీఎస్టీ వసూళ్లు దారుణంగా పడిపోయిన వైనం
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో మరింతగా పడిపోయిన రెవెన్యూ

సాక్షి ప్రతినిధి, అనంతపురం : సంపద సృష్టిస్తా అంటూ పదే పదే చెప్పే చంద్రబాబు నాయుడు మాటలకు.. చేతలకు పొంతన లేకుండా ఉంది. ఉమ్మడి జిల్లాలో సంపద మార్గాలు దేవుడెరుగు ఆదాయం లేక ప్రజలు అప్పులు చేసుకుంటున్న దుస్థితి నెలకొంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఏ రంగంలో చూసినా అప్పులే కానీ ఆదాయం లేని పరిస్థితి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు భారీగా నష్టపోయారు. కూరగాయల రైతులకు పెట్టుబడి కూడా తిరిగి రాలేదు. మరోవైపు భూముల క్రయవిక్రయాలు లేక జిల్లాలో రెవెన్యూ వనరులు భారీగా దెబ్బతిన్నాయి. రైతుల నుంచి సామాన్యుల వరకూ ఎక్కడా అప్పులు పుట్టని పరిస్థితి నెలకొంది.

కుదేలైన చిన్న మార్కెట్లు

అనంతపురం జిల్లా కేంద్రంలో కమలానగర్ మార్కెట్ అంటే చాలా పేరుంది. రోజూ కోట్లాది రూపాయల బిజినెస్ జరుగుతుంది. బట్టల నుంచి యాక్సెసరీస్ వరకూ ఇక్కడ దొరకని వస్తువేదీ ఉండదు. నాలుగైదు వేల షాపులకు మించి ఉంటాయి. కూటమి సర్కారు వచ్చిన తర్వాత కమలానగర్ బోసిపోయింది. షాపులో ఓనరు, వర్కరు మినహా ఎవరూ లేరని వాపోతున్నారు. గతంతో పోలిస్తే 50 నుంచి 60 శాతం పైగా బిజినెస్ తగ్గిపోయిందని వ్యాపారులు వాపోతున్నారు.

రిజిస్ట్రేషన్లు పడిపోయాయి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికీ క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్ల పరిస్థితి దారుణంగానే ఉంది. స్థలాలు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్‌లు కొనుగోలు చేయాలంటేనే భయపడుతున్నారు. రెండు జిల్లాల్లోనూ సుమారు రూ.650 కోట్ల వసూళ్లు లక్ష్యం కాగా రూ.400 కోట్లు కూడా చేరుకోలేక పోయారు. ప్రభుత్వానికి ఇదే పెద్ద ఆదాయ వనరు. కానీ ఈ రంగం ఇప్పుడు కుదేలైంది.

పరిశ్రమల ఆదాయం డౌన్

గడిచిన ఏడాది కాలంలో పరిశ్రమల నుంచి వచ్చే ఆదాయం భారీగా పడిపోయినట్టు తేలింది. ప్రముఖంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు కియా సంస్థ నుంచి ఒక్క రూపాయి కూడా ట్యాక్సు రూపంలో రాలేదని జీఎస్టీ అధికారులు చెబుతున్నారు. చిన్న పరిశ్రమలు రాలేదు. దీంతో ఆదాయమూ లేదు, ఉద్యోగాలు అంతకంటే లేవు అని నిరుద్యోగులు గగ్గోలు పెడుతున్నారు.

ఉద్యాన పరిస్థితి అధ్వానం

రాష్ట్రంలోనే ఉద్యాన పంటల్లో అనంతపురం జిల్లా అగ్రగామి. అలాంటిది ఈ ఏడాది ఏ పంటకూ గిట్టుబాటు ధర లేక ఆదాయం ఘోరంగా పడిపోయింది. మిరప, అరటి, చీనీ, మామిడితో పాటు టమాట లాంటి వాటి రేట్లు నేలచూపు చూశాయి. దీంతో భారీగా నష్టం వాటిల్లింది. ఎప్పుడూ లేని విధంగా ఉద్యాన పంటలకు గిట్టుబాటు ధరలు లేక వేలాది మంది రైతులు నష్టపోయారు.

2024-25 ఆర్థిక సంవత్సరంలో తగ్గుదల ఇలా..

కేటగిరీ	మార్కెట్ పరిస్థితి
చిన్న మార్కెట్‌లు	రూ.5,000 కోట్ల నుంచి రూ.2,200 కోట్లకు
రిజిస్ట్రేషన్స్ రెవెన్యూ	రూ.429 కోట్ల లక్ష్యం.. వచ్చింది రూ.280 కోట్లు
చిన్న పరిశ్రమలు	రూ.200 కోట్ల నుంచి రూ.105 కోట్లకు
ఉద్యానఫలాలు	రూ.24,857 కోట్ల నుంచి రూ.18,600 కోట్లకు
ఇండస్ట్రీస్ నుంచి	రూ.13,064 కోట్ల నుంచి రూ.950 కోట్లకు

నేడు యోగా దినోత్సవం

- పీటీసీ మైదానంలో జిల్లాస్థాయి కార్యక్రమం
- పకడ్బందీ ఏర్పాట్లకు కలెక్టర్ ఆదేశం



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: నగరంలోని పీటీసీ మైదానంలో శనివారం నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం జిల్లాస్థాయి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పీటీసీ మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 7 నుంచి ఉదయం 8 గంటల వరకు యోగా కార్యక్రమం ఉంటుందన్నారు. దాదాపు 5 వేల మంది పాల్గొంటారని, ఎలాంటి లోపాలకు తావివ్వకుండా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని ఆదేశించారు. మైదానంలో 25 మందికి ఒక గ్రిడ్‌గా 200కు పైగా గ్రిడ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు ఇచ్చేందుకు సిద్ధం చేసిన సర్టిఫికెట్లు, టీషర్టులు, టోపీలను ప్రతి గ్రిడ్ ఇన్‌చార్జ్‌కి అందించాలన్నారు. విశాఖపట్నంలో ప్రధానమంత్రి పాల్గొనే కార్యక్రమాన్ని తిలకించేందుకు లైవ్ లింక్‌కు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమానికి హాజరైన వారికి స్నాక్స్, తాగునీరు అందించేందుకు వీలుగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎ.మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి, నగర పాలక కమిషనర్ బాలస్వామి, డీఎస్పీ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ శైలజ, మెప్మా పీడీ విశ్వజ్యోతి, ఆయుష్ అధికారులు రామ్‌కుమార్, లాల్యానాయక్, ఎస్‌ఐసీ అధికారి భారతి, డీఎస్‌ఓ వెంకటేశ్వరు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏం తమాషా చేస్తున్నారా..?

'ఏయ్.. ఏం తమాషా చేస్తున్నారా..? ఒకసారి చెప్తే మీకు అర్థం కాదా.. మీకు మొన్నే చెప్పాను.. ఇది ఎమ్మెల్యే అనుచరుల ఆధీనంలో ఉందని ఎన్నిసార్లు చెప్పాలి.. వెంటనే కార్యాలయాన్ని ఖాళీ చేసి వెళ్లిపోండి. లేదంటే పరిస్థితి బాగుండదు. మీకు చెప్పినా అర్థం కాదు కాబట్టే బయట తాళం వేసుకుని వెళ్తాము. మీకు దిక్కున్న చోట చెప్పుకోండం'టూ కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అనుచరులు గాలిమరల కంపెనీ కార్యాలయం వద్ద హల్‌చల్ చేశారు.

వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోండి

- ఎట్రియా సిబ్బందిని భయపెట్టిన ఎమ్మెల్యే అనుచరులు
- సిబ్బందిని లోపల ఉంచి బయట గేటుకు తాళం వేసిన వైనం
- ఐదుకల్లు గాలిమరల కంపెనీ కార్యాలయం వద్ద ఘటన





లోపల బిక్కు బిక్కు మంటున్న సిబ్బంది, ఎట్రియా కార్యాలయం వద్ద వేచి ఉన్న టీడీపీ కార్యకర్తలు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం సమీపంలోని ఐదుకల్లు రోడ్డులో ఎట్రియా బ్రైత్ విండ్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పేరిట గాలిమరల కంపెనీ ఏర్పాటు చేశారు. ఈ సంస్థలో సెక్యూరిటీ, సూపర్‌వైజర్లు, ఐటీ టెక్నీషియన్లు దాదాపు 70 మంది పని చేస్తున్నారు. మూడు రోజుల క్రితం కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్యే అమిలినేని అనుచరులు 'ఇక్కడ్నుంచి ఖాళీ చేసి వెళ్లిపోండి' అని సెక్యూరిటీ సిబ్బందికి హుకుం జారీ చేశారు. మీరు వెళ్లకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని కూడా బెదిరించారు. తమకు ఇంకా రెండున్నరేళ్ల పాటు అగ్రిమెంట్ ఉందని, తామెందుకు బయటకు పోవాలంటూ సంస్థ ప్రతినిధులు ప్రశ్నించారు.

భయపెట్టి.. తాళం వేసి..

తాజాగా శుక్రవారం ఎమ్మెల్యే అనుచరులు మరోసారి ఎట్రియా కార్యాలయానికి వెళ్లారు. 'ఏం..మీకు చెప్తుంటే తమాషాగా ఉందా..? ఖాళీ చేసి వెళ్లిపోవాలని చెప్పాం కదా.. అభయ్ సెక్యూరిటీ ఏజెన్సీ కింద మా మనుషులు వస్తారు. ఇంకా ఇక్కడే ఉంటే చాలా ఇబ్బంది పడతారం'టూ తమ వెంట తెచ్చుకున్న సిబ్బందిని అక్కడే ఉంచి బయట గేటుకు తాళం వేశారు. లోపల ఉన్న ఎట్రియా సిబ్బంది సైతం భయపడుతూ లోపలి వైపు మరో తాళం వేసుకున్నారు. దీంతో బయట కొత్తగా వచ్చిన సిబ్బంది.. లోపల ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బంది ఉండటంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది.

పొట్టకూటి కోసం వచ్చిన వారినీ వదల్లేదు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గాలిమరల కంపెనీలో సెక్యూరిటీగా, టెక్నికల్ సిబ్బందిగా పని చేస్తున్న వారిని సైతం ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని అనుచరులు వదిలిపెట్టడం లేదని పలువురు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము టీడీపీకి చెందిన వారమైనా తమపైనే కక్ష సాధింపునకు దిగుతున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఏదైనా ఉంటే పార్టీ నేతలు చూసుకోవాలి కానీ తమలాంటి పేదల పొట్ట కొట్టడం ఏంటని వారు నిలదీస్తున్నారు. రెండన్నరేళ్లు అగ్రిమెంట్ ఉన్నా తమను విధుల నుంచి తప్పుకోవాలని అమిలినేని అనుచరులు భయపెట్టడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డామని వారు అంటున్నారు.

మందకొడిగా విత్తన పంపిణీ

- ఇప్పటి వరకు 27 వేల మందికి 26 వేల క్వింటాళ్ల పంపిణీ

అనంతపురం అగ్రికల్చర్: రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ మందకొడిగా సాగుతోంది. కేటాయింపులు, రాయితీలు, ధరలు, అనుమతులు, పంపిణీ ప్రక్రియ మొదలు పెట్టకుండా కూటమి సర్కారు జాప్యం చేయడం, బదిలీల నేపథ్యంలో వ్యవసాయశాఖ కూడా రైతులను సమాయత్తం చేయడంలో విఫలం కావడంతో ఈ దుస్థితి తలెత్తినట్లు చెబుతున్నారు. గతంలో మే మూడో వారంలోనే విత్తన పంపిణీ మొదలు పెట్టి జూన్ మొదటి వారంలోపు పూర్తి చేసిన దాఖలాలు ఉన్నాయి. ఈసారి జూన్ 5న పంపిణీ మొదలు పెట్టారు. దీనికితోడు ప్రభుత్వం నుంచి అన్నదాత సుఖీభవ, ఇన్‌పుట్, ఇన్సూరెన్స్ లాంటి వాటి ద్వారా ఎలాంటి సాయం అందకపోవడం.. విత్తన నాణ్యతపై విమర్శల నేపథ్యంలో రాయితీ వేరుశనగను తీసుకునేందుకు అన్నదాతలు ఆసక్తి చూపలేదు.

26 వేల క్వింటాళ్ల పంపిణీ..

ఈ ఏడాది జిల్లాకు చాలా తక్కువగా కేవలం 50,592 క్వింటాళ్ల కేటాయించారు. ఈనెల 5 నుంచి ఇప్పటి వరకు ... ఈ 15 రోజుల్లో 27 వేల మంది రైతులకు 26 వేల క్వింటాళ్లు పంపిణీ చేశారు. 36 వేల క్వింటాళ్లు అవసరమని 40 వేల మంది రైతులు ఆర్‌ఎస్‌కే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఏపీ సీడ్స్ ద్వారా ఇప్పటి వరకు 38 వేల క్వింటాళ్లు సరఫరా చేశారు. మరోపక్క ప్రాసెసింగ్, సరఫరా కొనసాగుతోందని, ఇంకా రిజిస్ట్రేషన్లు, పంపిణీ జరుగుతున్నందున ఈ నెలాఖరులోపు కేటాయింపులు మేరకు వేరుశనగ పంపిణీ పూర్తి చేస్తామని జేడీఏ కార్యాలయ వర్గాలు తెలిపాయి.



విత్తన వేరుశనగ

మాకొద్దే వద్దు!

గతానికి భిన్నంగా ఈ సారి తాడిపత్రి డివిజన్ పరిధిలో తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు, పెద్దపప్పూరు రైతులు వేరుశనగ సాగుపై అనాసక్తి ప్రదర్శించినట్లు విత్తన పంపిణీ సరళి తెలియజేస్తోంది. ఈ నాలుగు మండలాల్లో ఇప్పటి వరకు ఒక్క క్వింటా కూడా రైతులు తీసుకెళ్లలేదు. ఇందులో యల్లనూరు మండలానికి ఒక్క క్వింటా కూడా కేటాయించలేదు. పుట్లూరుకు 50 క్వింటాళ్లు, తాడిపత్రికి 80 క్వింటాళ్లు, పెద్దపప్పూరుకు 100 క్వింటాళ్లు కేటాయించినా ఆర్‌ఎస్‌కేల్లో ఒక్క రైతు కూడా తమకు విత్తనం కావాలని రిజిస్ట్రేషన్ చేసుకోకపోవడం విశేషం. విడపనకల్, పెద్దవడుగూరు, ఉరవకొండ, బొమ్మనహాల్, పామిడి, బెళుగుప్ప, యాడికి తదితర మండలాల్లో కూడా పెద్దగా స్పందన కనిపించడం లేదు. శెట్టూరులో అత్యధికంగా 2 వేల క్వింటాళ్లు పంపిణీ కాగా... రాయదుర్గం, ఆత్మకూరు, కూడేరు, నార్పల, గుమ్మఘట్ట, కణేకల్లు, బ్రహ్మసముద్రం, కుందుర్పి తదితర మండలాల్లో విత్తన పంపిణీ మోస్తరుగా సాగుతోంది. కేటాయించిన విత్తన వేరుశనగ పూర్తయ్యే వరకు పంపిణీ కొనసాగిస్తామని జేడీఏ, ఏపీ సీడ్స్ వర్గాలు తెలిపాయి.

తుంగభద్రకు పోటెత్తిన వరద



వరద నీటితో కళకళలాడుతున్న టీబీ డ్యాం

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తింది. బుధవారం 19,265 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో గురువారం 43,706, శుక్రవారం సాయంత్రానికి 51,261 క్యూసెక్కులకు పెరిగింది. శనివారం ఉదయానికి మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. డ్యాంలో నీరు 40 టీఎంసీలకు చేరువగా ఉంది. శివమొగ్గ, ఆగుంబే, శృంగేరి, చిక్కమంగళూరు, వరనాడు తదితర తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో డ్యాం ఎగువన నిర్మించిన అప్పర్‌తుంగా ప్రాజెక్ట్ (గాజనూరు జలాశయం) నిండటంతో 30 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దీనికి తోడు రిజర్వాయర్ పరిసరాల్లో ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో మరింత పెరుగుతున్నట్లు తుంగభద్ర బోర్డు అధికారులు వెల్లడించారు. త్వరలోనే డ్యాంలో బోర్డు అధికారులు నిర్ణయించిన మట్టానికి నీరు చేరే అవకాశాలు ఉండటంతో జూలై 13న హెచ్చెల్సీకి నీటిని విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

- గతేడాది 33 క్రస్ట్ గేట్లలో 19వ క్రస్ట్ గేటు కొట్టుకుపోవడం, మిగిలిన 32 గేట్లు కూడా దెబ్బతినడం వల్ల నిపుణుల సూచనల మేకు వాటిని మార్చాలని టీబీ బోర్డు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో గేట్ల అంచు వరకు 80 టీఎంసీల నీరును మాత్రమే నిల్వ చేసి కాలువలకు వదులుతారు. ఎక్కువ వరద వస్తే నదికి వదిలేయనున్నారు. ఒక డ్యాంలో నీటి నిల్వ 40 టీఎంసీలకు తగ్గిన తర్వాత కొత్త గేట్లను అమర్చనున్నట్లు సమాచారం. వచ్చే ఖరీఫ్ నాటికి గేట్ల బిగింపు ప్రక్రియ పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.
- ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ 1,633 అడుగులకు గాను 1610.52 అడుగులకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 51,261 క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లో 256గా ఉంది. మొత్తం నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా ప్రస్తుతం 38.610 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 1582.48 అడుగుల వద్ద 5.790 టీఎంసీల నీరు నిల్వతో 759 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1,796 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉండేదని బోర్డు అధికారులు తెలిపారు.

చావనైనా చస్తాం.. భూములు ఇవ్వం

- సర్వేను అడ్డుకున్న రైతులు
- వెనుదిరిగిన రెవెన్యూ అధికారులు

రాప్తాడు: అన్నం పెట్టే భూములను పరిశ్రమల కోసం ఇవ్వలేం అంటూ రైతులు తెగేసి చెప్పారు. కాదని మా పొలాల్లో సర్వే చేస్తే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటాం అని హెచ్చరించారు. చేసేదిలేక అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఎంఎస్‌ఎంఈ పార్క్ పేరిట బొమ్మేపర్తి గ్రామ రెవెన్యూ పొలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందు కోసం అక్కడ పేదలు సాగు చేసుకుంటున్న భూములను సేకరించడానికి చర్యలు తీసుకున్నారు. భూములు పోతే జీవనోపాధి కోల్పోతామని, ఇందుకు తాము సిద్ధంగా లేమని, వెంటనే బలవంతపు సేకరణ ఆపాలని బాధితులు సీపీఎం, రైతుసంఘం, సీఐటీయూ నాయకులతో కలిసి ఇదివరకు మండల అధికారులకు, కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు అందజేశారు. అయినా వాటిని పరిగణనలోకి తీసుకోని రెవెన్యూ అధికారులు శుక్రవారం సర్వే చేయడానికి వచ్చారు. దీంతో బాధిత రైతులు సర్వే చేయకుండా అడ్డుకున్నారు. వీరికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రామాంజినేయులు, రైతు సంఘం మండల కార్యదర్శి పోతులయ్య మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 307లో 27 మంది రైతులకు సంబంధించి 120 ఎకరాలు ఉన్నాయన్నారు. 60 ఏళ్ల కిందట డీ పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేశారన్నారు. అప్పట్లో గుట్టలు, రాళ్లు తొలగించి సాగు భూమిగా మార్చుకోవడానికి ఒక్కో రైతుకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా ఖర్చయ్యిందన్నారు. కొందరు ఈ భూముల్లో షెడ్లు ఏర్పాటు చేసుకుని పాడి పెంపకం, గొర్రెల పెంపకం చేపట్టారన్నారు. వీరికి ఇంకెక్కడా సెంటు భూమి లేదన్నారు. ఇప్పుడు ఈ కాస్త భూమిని కూడా ఎంఎస్‌ఎంఈ పార్క్‌కు అప్పగిస్తే జీవనోపాధి కోల్పోతారన్నారు. ఈ ఏడాది మార్చిలో 307 సర్వే నంబర్‌లో 114 ఎకరాలు అప్పగించడానికి తహసీల్దార్ ఏపీఐఐసీ అధికారులకు లేఖ పంపారన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం సంబంధిత రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఒక్కసారిగా పరిశ్రమల పేరుతో ఆ భూములను బలవంతంగా లాక్కోవడం దారుణమన్నారు. పరిశ్రమలు, ఉపాధి అవసరమే కానీ పేదల భూములను తీసుకోవడం సబబు కాదని హితవు పలికారు. పేదలకు ప్రభుత్వం సహాయం చేయాల్సింది పోయి ఇలా వారికి సమాచారం తెలియకుండా దౌర్జన్యంగా తీసుకోవడం అన్యాయమన్నారు. పరిశ్రమల కోసం తమ భూములను ఇవ్వలేమని రైతులు తెగేసి చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనందరెడ్డి, బాధిత రైతులు ముత్యాలప్ప, మల్లికార్జున, మాధవయ్య, వేణుగోపాల్, వన్నూరప్ప, నిర్మల, మౌనిక, పార్వతమ్మ, యల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారులు చేస్తున్న సర్వేను అడ్డుకుంటున్న రైతులు

భూమిని వదులుకోలేం



బొమ్మేపర్తి రెవెన్యూ పొలంలో మాకు ఐదు ఎకరాలు ఉంది. 2012 జూలై 5న నా భర్త బాలగొండ గొల్లపల్లయ్య ఇదే పొలంలో కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని అప్పటి మంత్రిగా ఉన్న పరిటాల సునీతను వేడుకున్నాను. అయినా ఆర్థికసాయం అందలేదు. ఆ సమయంలోనే నిర్మించుకున్న పక్కాగృహానికి సంబంధించి బిల్లు కూడా పడలేదు. ఇప్పుడు ఈ భూమిని వదులుకునే పరిస్థితి లేదు. ఆ పరిస్థితి వస్తే చావడానికి కూడా సిద్ధమే.

– బాలగొండ నిర్మల

క్లుప్తంగా

విద్యాసామగ్రి విక్రయిస్తున్న 'నారాయణ' గది సీజ్



గదిని సీజ్ చేస్తున్న కార్పొరేషన్ ఉద్యోగులు

అనంతపురం ఎడ్యుకేషన్: నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం నగరంలోని జీసస్ నగర్‌లో అక్రమంగా ఓ ఇంట్లో పుస్తకాలు, యూనిఫాం, బూట్లు ఇతర విద్యాసామగ్రిని డంప్ చేసి విక్రయాలు సాగిస్తుండగా శుక్రవారం ఏబీవీపీ నాయకులు అడ్డుకుని ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న కార్పొరేషన్ శానిటరీ సెక్రటరీ వెంకటేశులు, నరసింహమూర్తి అక్కడకు చేరుకుని పరిశీలించారు. కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా పుస్తకాలు విక్రయిస్తున్న గదిని పోలీసుల సమక్షంలో సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... తమ మంత్రి పదవిని అడ్డుగా పెట్టుకుని నారాయణ విద్యాసంస్థల అధినేత విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికార మదంతో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి పుస్తకాలు, యూనిఫాం వ్యాపారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేల రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించే ఏ విద్యాసంస్థనైనా అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు దివాకర్ నాయక్, భరత్ రెడ్డి, విజయ్, గణేష్, మణిదీప్, కుమార్ పాల్గొన్నారు.

రూడ్‌సెట్‌లో ఉచిత శిక్షణ

అనంతపురం సెంట్రల్: బ్యూటీషియన్ కోర్సుపై జిల్లా కేంద్రంలోని ఎస్కేయూ సమీపంలో ఉన్న రూడ్‌సెట్ సంస్థలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 18 నుంచి 45 ఏళ్ల లోపు వయస్సు, రేషన్‌కార్డు కలిగిన గ్రామీణ నిరుద్యోగ మహిళలు అర్హులు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం ఉంటుంది. పూర్తి వివరాలకు 94925 83484లో సంప్రదించవచ్చు.

బాలిక అదృశ్యం

బొమ్మనహాళ్ / బెళుగుప్ప: మండలంలోని కోనంపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలిక గురువారం నుంచి కనిపించడం లేదు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శుక్రవారం ఉదయం తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రామదాసు తెలిపారు.

దగాపడిన వరి రైతులు

- 'మద్దతు' పేరుతో ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం
- విక్రయించి రెండు నెలలవుతున్నా చేతికి అందని చిల్లి గవ్వ
- 363 మంది రైతులకు రూ.8.59 కోట్ల బకాయి
- అయోమయంలో వరి రైతులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

'ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తే వారం, పది రోజుల్లో నగదు చెల్లించేవారు. సాగుకు చేసిన అప్పులు తీర్చుకుని ప్రశాంతంగా జీవించే వాళ్లం. ప్రభుత్వ సూచన మేరకు ఆర్‌ఎస్‌కేల్లో విక్రయించాం. రెండు నెలలు కావస్తున్నా ధాన్యం నగదు చెల్లించలేదు. సాగు కోసం చేసిన అప్పులకు వడ్డీల భారం పెరుగుతోంది. నగదు అడుగుతుంటే అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. మరో పక్క అప్పులు చెల్లించాలంటూ ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి' అంటూ వరి రైతులు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వాన్ని నమ్మి మోసపోయామంటూ వాపోతున్నారు.

రాయదుర్గం: రబీలో వరి సాగు చేసిన రైతులు ఆరంభం నుంచి కష్టాలనే ఎదుర్కొన్నారు. ఎకరానికి 40 నుంచి 50 బస్తాలు పండాల్సిన చోట ప్రతికూల వాతావరణ పరిస్థితులు వెంటాడటంతో 20–25 బస్తాల దిగుబడి మాత్రమే వచ్చింది. అరకొరగా పండిన పంటకు మద్దతు ధర వస్తుందని ఆర్‌ఎస్‌కే కేంద్రాలుగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే.. రెండు నెలలైనా పైసా జమ కాకపోవడంతో తామెలా బతకాలో చెప్పాలంటూ కూటమి ప్రభుత్వాన్ని రైతులు ప్రశ్నిస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోపు రైతు ఖాతాల్లోకి నగదు జమ చేస్తామంటూ గొప్పలు చెప్పిన సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కళ్యాణ్, మంత్రులు పత్తా లేకుండా పోయారంటూ రైతులు బాధపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా గత రబీలో 4,528 హెక్టార్లలో వరి పంట సాగైంది. ఇందులో కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాల్లోని హెచ్చెల్సీ ఆయకట్టు భూముల్లో సుమారు 3 వేల హెక్టార్లకు పైగా సాగు చేశారు. సుమారు 18 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తక్కువ కాకుండా పండించారు. కూటమి



లారీల్లో తరలిస్తున్న ధాన్యం(ఫైల్)

ప్రభుత్వం ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా కేవలం 3,859 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది. ఇందులో సాధారణ రకానికి రూ.2,300, ఏ గ్రేడ్‌కు రూ.2320 చెల్లించేలా ధర నిర్ణయించింది. మిగిలిన ధాన్యాన్ని అందినకాడికి దళారులకు రైతులు అమ్ముకోవాల్సి వచ్చింది.

ఎప్పుడిస్తారో తెలియదు

జిల్లా వ్యాప్తంగా రబీ లో 363 మంది రైతులతో 3,859 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరతో కూటమి ప్రభుత్వం కొనుగోలు చేసింది. వీటి విలువ రూ.8.95 కోట్లు కాగా నిబంధనల ప్రకారం ధాన్యం అమ్మిన 24 గంటల్లోపు రైతు ఖాతాల్లోకి నగదు జమచేయాల్సి ఉంది. కానీ, రెండు నెలలు కావస్తున్నా నేటికీ నగదు అందకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులను అడిగితే వారం పది రోజులంటూ దాట వేస్తున్నారు. 'పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తడిసి మోపెడవుతున్నాయి. గాలీవాన బీభత్సానికి నష్టపోయిన పంటలకు పరిహారం నేటికీ ఇవ్వలేదు. కనీసం అమ్ముకున్న పంటకైనా డబ్బులిస్తే అప్పులు తీర్చుకుంటాం' అని రైతులు వేడుకుంటున్నా ఫలితం లేకపోతోంది. డబ్బులు కట్టాలంటూ అప్పులోళ్లు రోజూ ఇళ్ల చుట్టూ తిరుగుంటే సమాధానం చెప్పుకోలేక అన్నదాతలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

వడ్డీల భారం పెరుగుతోంది



పంట పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద వడ్డీకి అప్పు చేశా. పంట విక్రయించి రెండు నెలలైంది కాబట్టి డబ్బు కట్టాలంటూ వారు ఒత్తిళ్లు చేస్తున్నారు. ఇంకా డబ్బులు పడలేదని చెబితే వినడం లేదు. అధికారులు కూడా మాకు సరైనా సమాధానం చెప్పడం లేదు. ఓ వైపు వడ్డీల భారం పెరిగి పోతోంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– హనుమంతరెడ్డి, రైతు, ఉద్దేహాళ్ గ్రామం, బొమ్మనహాళ్ మండలం

రెండు నెలలైనా డబ్బు రాలేదు



ఉద్దేహాళ్‌లోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో 500 క్వింటాళ్ల ధాన్యం విక్రయించి రెండు నెలలైంది. 24 గంటల్లోపు నగదు ఖాతాలో జమ చేస్తామని ఆ రోజు అధికారులు చెప్పారు. ఇప్పటి వరకూ ఖాతాలోకి డబ్బు జమ కాలేదు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, సంబంధిత అధికారులు సరైన సమాధానం చెప్పడం లేదు.

– సువర్ణకుమారి, రైతు, గోడిశలపల్లి గ్రామం, డి.హీరేహాళ్ మండలం

ఇది రైతు ద్రోహి ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని గాలి కొదిలేసింది. రైతులను మభ్య పెట్టి కొనుగోలు చేసిన ధాన్యం డబ్బు కూడా జమ చేయకుండా రెండు నెలలుగా నానా ఇబ్బందులకు గురి చేస్తోంది. కొనుగోలు చేసిన ధాన్యం డబ్బుతో పాటు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఇచ్చిన భరోసా మేరకు పరిహారం తక్షణమే చెల్లించాలి. లేకపోతే రైతులు పక్షాన నిలిచి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తాం.

– మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ఈ నెలాఖరు లోపు జమ చేస్తాం

రబీలో సేకరించిన ధాన్యానికి సంబంధించి డబ్బు చెల్లించాల్సి ఉంది. వివిధ కారణాల వల్ల జాప్యం నెలకొన్న మాట వాస్తవం. ఈ నెలాఖరులోపు రైతు ఖాతాల్లోకి ప్రభుత్వం నేరుగా నగదు జమ చేస్తుంది.

– రమేష్‌రెడ్డి, సివిల్ సప్లయిస్ డీఎం

ఈ-కేవైసీ చేయించుకోవాలి

రాప్తాడు: అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఈ-కేవైసీ చేయించుకోవాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి ఉమా మహేశ్వరమ్మ సూచించారు. శుక్రవారం ఆమె మరూరు, రాప్తాడు రైతు సేవ కేంద్రాలను తనిఖీ చేశారు. రికార్డులు, విత్తన వేరుశనగ కాయలను పరిశీలించి, రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్నదాత సుఖీభవకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వారు మాత్రమే ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణ చైతన్య, ఏఈఓ రంజిత, వీఏఏ శ్రీనివాసులు, వీహెచ్ఏ సోనియా, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

తోటి రైతులతో నాణ్యమైన విత్తనం

కూడేరు: తోటి రైతులతో నేరుగా విత్తనాలు కొనుగోలు చేస్తే తూకాల్లో తేడాలుండవని.. నాణ్యమైన విత్తనాలు లభిస్తాయని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. కార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన మండల స్వశక్తి రైతు సంఘం 14 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. వ్యవసాయ శాఖ సహకారంతో ఎస్ఎంఈఓ–ఓఎస్ పథకం ద్వారా సంఘంలోని 264 మంది రైతులకు ఉచితంగా టీసీజీఎస్–1694 రకం వేరుశనగ విత్తనాలను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమం శుక్రవారం కూడేరులో నిర్వహించారు. ముఖ్య అతిథి జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ పంపిణీ చేసిన విత్తనాలు సాగు చేసి దిగుబడిని 'బై బ్యాక్' అగ్రిమెంట్ ప్రకారం ఈ సంఘానికే విక్రయించాలని సూచించారు. సాగులో నాణ్యమైన విత్తనాన్నే ఎంపిక చేసుకోవాలన్నారు. తద్వారా అధిక దిగుబడులు సాధించడానికి అవకాశముంటుందన్నారు. మీరు పండించిన పంటను దళారుల ద్వారా మార్కెట్లో విక్రయించి నష్టపోవద్దని సూచించారు. తోటి రైతులకు, రైతు సంఘాలకు విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో కార్డ్ సంస్థ ప్రతినిధి నిర్మలా రెడ్డి, సర్పంచ్ లలితమ్మ, ఏఓ శుభకర్, ఏఈఓ రాఘవేంద్ర, రైతు సేవ కేంద్రం సిబ్బంది రాజ్‌కుమార్, జయప్రకాష్, శ్రీలత, భాస్కర్ నాయక్, రెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

గుత్తి: స్థానిక జీఆర్పీ పరిధిలోని జక్కల చెరువు రైల్వే స్టేషన్ సమీపంలో జక్కలచెరువుకు చెందిన రామాంజనేయులు(42) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన చోటు చేసుకుంది. ఆయనకు భార్య, ఓ కుమారుడు ఉన్నారు. కుటుంబ కలహాల కారణంగా జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మహిళ కిడ్నాప్.. కేసు నమోదు

బెళుగుప్ప: మహిళ కిడ్నాప్‌నకు గురైందంటూ కుటుంబసభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బెళుగుప్ప పీఎస్ ఎస్ఐ శివ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గంగవరం గ్రామానికి చెందిన ఓ మహిళను కళ్యాణదుర్గం మండలం ఒంటిమిద్ది గ్రామానికి చెందని వంశీ, ఆయన కుటుంబసభ్యులు గురువారం కిడ్నాప్ చేశారంటూ బాధితురాలి కుటుంబసభ్యురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ అనంతరం కిడ్నాప్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జల్సాల కోసం చోరీలు

- ఇళ్లల్లో చోరీలకు పాల్పడే ఇద్దరి అరెస్ట్

రాప్తాడు రూరల్: జల్సాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు అనంతపురం రూరల్ పోలీసులు తెలిపారు. అనంతపురం రూరల్ పీఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ శేఖర్ వెల్లడించారు. పట్టుబడిన వారిలో అనంతపురం రూరల్ మండలం పాపంపేటకు చెందిన చిన్న బాబు, గుంతకల్లు మండలం దోసలుడికి గ్రామానికి చెందిన అరికిచెర్ల రామ్మోహన్ ఉన్నారు. చిన్నబాబు చిన్న వయసులోనే తండ్రి చనిపోయాడు. దీంతో సరైన పర్యవేక్షణ లేక చిరు ప్రాయం నుంచే వ్యసనాలు, జల్సాల బాట పడ్డాడు. ఇందుకు అవసరమైన డబ్బు కోసం దొంగతనాలకు తెరలేపాడు. 2024లో మోటారు సైకిళ్లు, చిల్లర దొంగతనాలు, ఏటీఎం యంత్రాలను ధ్వంసం చేసి నగదు అపహరించడం తదితర కేసుల్లో పట్టుపడి రిమాండ్‌కు వెళ్లాడు. జైలు ఉన్న సమయంలోనే అప్పటికే హత్యాకేసులో ముద్దాయిగా ఉన్న రామ్మోహన్‌తో పరిచయమైంది. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఇద్దరూ జల్సాలు తీర్చుకునేందుకు, చేసిన అప్పులు తీర్చడానికి అనంతపురం రూరల్ పరిధిలోని ఓవీఆర్ కాలనీలో ఉన్న విశ్రాంత ఉపాధ్యాయుడు ఆంజనేయులు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పట్టపగలే దొంగతనం చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్పీ జగదీష్ ఆదేశాలతో రూరల్ డీఎస్పీ వెంకటేషులు పర్యవేక్షణలో దర్యాప్తు వేగవంతం చేశారు. పక్కా ఆధారాలతో చిన్నబాబు, రామ్మోహన్‌ను నిందితులుగా గుర్తించి శుక్రవారం అనంతపురంలోని కళ్యాణదుర్గం లో రోడ్డులో ఉన్న సెయింట్ ఆన్స్ స్కూల్ దగ్గర తచ్చాడుతున్న ఇద్దరినీ అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం వారి నుంచి బంగారు చిన్న నల్లపూసల దండ, పెద్ద నల్లపూసల దండ, చిన్న పిల్లల బంగారు బ్రాస్లెట్, చిన్న పిల్లల గాజులు నాలుగు, జుంకీ కమ్మల సెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

నరసాపురంలో చోరీ

బెళుగుప్ప: మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్న తిమ్మారెడ్డికి భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడికి వివాహమైంది. ఈ క్రమంలో గ్రామ శివారులో ఉన్న గొర్రెల దొడ్డి వద్దకు గురువారం రాత్రి కాపలాకు తిమ్మారెడ్డి దంపతులు వెళ్లారు. అదే రోజు స్థానికంగానే ఉన్న పుట్టింటికి కోడలుతో పాటు కుమారుడూ వెళ్లాడు. విషయాన్ని గుర్తించిన దుండగులు ఇంటికి వేసిన తాళాన్ని బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి, బీరువాలోని రూ.1.50 లక్షల నగదు, ఓ బంగారు నెక్లెస్, రెండు జతల కమ్మలు, వెండి కాళ్ల పట్టీలు, కడియాలు అపహరించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శివ క్షేత్రస్థాయిలో పరిశీలించి కేసు నమోదు చేశారు.

రెవెన్యూలో పనిచేయడం అదృష్టంగా భావించాలి

అనంతపురం అర్బన్: రెవెన్యూ శాఖలో పని చేయడాన్ని ఓ అదృష్టంగా భావించాలని ఉద్యోగులకు కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో 'రెవెన్యూ డే' ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, డీఆర్ఓ ఎ.మలోల హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. అనంతరం పలువురు రెవెన్యూ విశ్రాంత అధికారులను, ఉద్యోగులను సన్మానించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

రైల్లో చోరీకి పాల్పడిన యువకుడి అరెస్ట్

గుత్తి: కాచిగూడ –మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైలు చోరీకి పాల్పడిన యువకుడిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్లితే కాచిగూడ-మైసూర్ రైలులో ప్రయాణికురాలు పద్మావతికి చెందిన బ్యాగులోని రూ.3,700 నగదు, రెండు సెల్‌ఫోన్లు గురువారం అర్ధరాత్రి చోరీకి గురయ్యాయి. ఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో అప్రమత్తమైన జీఆర్పీ ఇన్‌చార్జ్ ఎస్ఐ గోపాల్, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. రెండో ప్లాట్‌ఫారం వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న తమిళనాడుకు చెందిన మొరసుకోడిని అదుపులోకి విచారణ చేయడంతో చోరీ చేసినట్లు అంగీకరించాడు. రూ.3,700ల నగదుతో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కూడేరు: మండల కేంద్రానికి చెందిన మంగల సాయినాథ్ (33) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుల వృత్తితో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్తాపం చెందిన ఆయన శుక్రవారం సాయంత్రం ఇంటి వరండాలో చీరతో ఉరి వేసుకున్నాడు. గమనించిన రాజేశ్వరి వెంటనే స్థానికుల సాయంతో కాపాడి అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టండి

అనంతపురం టౌన్: పెన్నా పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ తరలింపులను అరికట్టాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఓబులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గనులశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ జియాలజిస్టు ఆదినారాయణను కలసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. శింగనమల, గార్లదిన్నె, పెద్దవడుగూరు మండలాల్లో పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. దీంతో రైతుల పొలాల్లోని బోరుబావుల్లో నీటి లభ్యత తగ్గిపోయిందన్నారు. ఇసుక అక్రమ తరలింపులు ఇలాగే కొనసాగితే సాగు, తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రోజూ వందలాది ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారన్నారు. ఇప్పటికే శింగనమల మండల పరిధిలోని గ్రామాల్లోని రైతులు ఇసుక అక్రమ రవాణను అడ్డుకుంటున్నా టీడీపీ నాయకులు దౌర్జన్యంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణాను అరికట్టకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తరిమెల నాగరాజు, దండు విజయ్‌కుమార్, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.



ఏజీ ఆదినారాయణకు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

అనంత, కడప జట్ల విజయం

అనంతపురం సెంట్రల్: ఏసీఏ, డీసీఏ సంయుక్త ఆధ్వర్యంలో రాయలసీమ క్రికెట్ గ్రౌండ్ వేదికగా శుక్రవారం నిర్వహించిన సౌత్‌జోన్ సీనియర్ టీ20 క్రికెట్ మ్యాచ్‌లో అనంత, వైఎస్సార్ కడప జిల్లాల జట్లు గెలుపొందాయి. తొలిమ్యాచ్‌లో అనంతపురం, చిత్తూరు జట్లు తలపడగా తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసింది. జట్టులో జ్ఞానేశ్వర్ 38 పరుగులు సాధించాడు. అనంతపురం బౌలర్లలో కామిల్ 3, రాజకుళ్లాయప్ప 3 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 17.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సునాయాశంగా సాధించింది. జట్టులో వినయ్‌కుమార్ 36 బంతుల్లో మూడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 53 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.

- మధ్యాహ్నం నిర్వహించిన మరో మ్యాచ్‌లో వైఎస్సార్ కడప, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసి కడప జట్టు 20 ఓవర్లలో 152 పరుగులు చేసింది. జట్టులో జహీర్ అబ్బాస్ 51 బంతుల్లో 5ఫోర్లు, ఆరు సిక్సర్లతో 78 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. నెల్లూరు జట్టులో భరత్ 5 వికెట్లు, భార్గవ్ 3 వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 15.3 ఓవర్ల వద్ద 100 పరుగులకు చతికిలపడింది. 52 పరుగులతో కడప జట్టు విజయం సాధించింది.



భద్రం బ్రదర్..

ఒకరిద్దరు కాదు.. ఏకంగా ఐదుగురు పిల్లలను పాఠశాలలో వదిలేందుకు ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఇలా పిలుచుకెళ్లాడు. అనంతపురంలోని మహాత్మగాంధీ కాలనీ (ఎర్రనేల కొట్టాల) సమీపంలో శుక్రవారం ఉదయం ఈ దృశ్యం కనిపించింది. ఒకే బైక్‌పై మొత్తం ఆరుగురు కూర్చొనేందుకు వీలు కాని పరిస్థితి. దీనికి అదనంగా తగిలించిన బడి బ్యాగులతో హ్యాండిల్ తిప్పేందుకు వాహనచోదకుడు అపసోపాలు పడాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో ఏదైనా జరగరానిది జరిగితే పసిపిల్లలు ఏమైపోవాలని చూసిన పలువురు మండిపడ్డారు.

– అనంతపురం ఎడ్యుకేషన్:

క్లుప్తంగా

సమ్మెలోకి నీటి సరఫరా సిబ్బంది



నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ.. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం నీటి సరఫరా సిబ్బంది శుక్రవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. అందులో భాగంగా నగరపాలక సంస్థ ముందు ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికలకు ముందు తమకు న్యాయం చేస్తారని కూటమి ప్రభుత్వానికి ఓటు వేస్తే.. ఏడాది అయినా తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వం ఉద్యోగ భద్రతతో పాటు, సంక్షేమ పథకాలు వర్తింపజేసే వరకు సమ్మె ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీ మునిసిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం.భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి లోకేష్ నాయుడు, కోశాధికారి కె.నారాయణ స్వామి, నాయకులు కుళ్లాయి స్వామి, పుల్లయ్య, మురళీ, రామాంజిరెడ్డి, శ్రీనివాసులు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో ప్రతిభ



పతకాలు చూపుతున్న చిన్నారి రియాన్స్ రెడ్డి

అనంతపురం సెంట్రల్: తిరుపతిలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో నగరానికి చెందిన రెడ్డివారి రియాన్స్ రెడ్డి రెండు బంగారు పతకాలు సాధించాడు. నగరంలో అరవిందనగర్‌లో నివాసముంటున్న లోకేష్ రెడ్డి, సుభాషిణి దంపతుల కుమారుడు రియాన్స్ తిరుపతిలో జరిగిన జోనల్ స్థాయి స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. రింక్‌వన్ విభాగంలో ఒక బంగారు పతకం, రింక్ 5 విభాగంలో ఒక బంగారు పతకాన్ని సాధించాడు. రియాన్స్‌ను కోచ్ అంజి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని మెడల్స్ సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

బాధ్యతలు స్వీకరించిన ఏఎంసీ ప్రిన్సిపాల్



డాక్టర్ షారోన్ సోనియాకు అభినందనలు చెబుతున్న వైద్యులు

అనంతపురం మెడికల్: అనంతపురం వైద్య కళాశాల (ఏఎంసీ) ప్రిన్సిపాల్‌గా డాక్టర్ షారోన్ సోనియా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ వైస్ ప్రిన్సిపాల్‌గా ఉన్న ఆమెకు ప్రిన్సిపాల్‌గా పదోన్నతి లభించిన విషయం విదితమే. దీంతో శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఆమెను వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ షారోన్ సోనియా మాట్లాడుతూ.. అనంతపురం వైద్య కళాశాల ఏర్పాటై దాదాపు 25 ఏళ్లు అవుతోందని, రాష్ట్రంలోనే అనంతపురం వైద్య కళాశాలకు మంచి గుర్తింపు ఉందని, ఇదే స్ఫూర్తితో ముున్ముందు మరింత మంచి పేరు తీసుకువచ్చేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలని ప్రొఫెసర్లకు సూచించారు.

బాధ్యతల స్వీకరణ

ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఆత్మారాం శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు హెచ్‌ఓడీలు అభినందనలు తెలిపారు.

రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక పాలన



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

అనంతపురం అర్బన్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి ధ్వజమెత్తారు. 10 గంటల పని నిర్ణయాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 10 గంటల పని విధానం అమలు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. 8 గంటల పని విధానం అమలు చేయాలంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజారెడ్డి మాట్లాడారు. కార్మికులపై పనిభారం తగ్గించి, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అమలుకు చేస్తున్న పోరాటాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలకు ప్రభుత్వం స్వస్తి చెప్పకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి వి.కృష్ణుడు, నగర అధ్యక్షుడు చిరంజీవి, నాయకులు రాజు, రామకృష్ణ, కృష్ణానాయక్, దుర్గాప్రసాద్, వేణుగోపాల్, రామాంజనేయులు, తిరుమలయ్య, ప్రసాద్, లక్ష్మీనారాయణ, వెంకటరమణ, నారప్ప, ప్రశాంత్, పెద్దన్న, అక్బర్ వలి, బాషా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం

- జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంతను గజమాలతో సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



హుస్సేన్ కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు అధికమయ్యాయి. జిల్లా కేంద్రంలో గిరిజన అమ్మాయి తన్మయి దారుణ హత్యకు గురైంది. ఆ అమ్మాయికి న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం ఆపదని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సాకే మహేష్ శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ.. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ఎస్టీలను సమీకరించుకుని పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. ఎవరికీ భయపడాల్సిన పనిలేదని.. బాధితులకు అండగా నిలవాలని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, నగరాధ్యక్షుడు దత్తా, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాకే శ్రీనివాసులు, నగర ఉపాధ్యక్షుడు సాకే రాజు, జిల్లా కార్యదర్శి అంజనమూర్తి, నాయకులు సాకే కొత్త రాయుడు, సాకే గంగయ్య, రసూల్, ఆఫ్రిది, సాకే మల్లి, గుజ్జల అనిల్, రమేష్, చాందు, నూర్, శశి, జయ, సాకే రవి, కృష్ణ, సాకే రమణ, మైను, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

హుస్సేన్ మృతి తీరని లోటు

అనంతపురం రూరల్: రాజీవ్‌కాలనీ మాజీ సర్పంచ్ హుస్సేన్ మృతి బాధాకరం. ఆయన మృతి పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లా కాకాణి లక్ష్మీపురం దగ్గర ఆగి ఉన్న లారీని బస్సు ఢీకొన్న ఘటనలో హుస్సేన్ మృతి చెందిన విషయం విదితమే. శుక్రవారం హుస్సేన్ మృతదేహాన్ని రాజీవ్‌కాలనీకి తీసుకొచ్చారు. రెండు పర్యాయాలు సర్పంచ్‌గా ఎన్నికై నిత్యం ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన హుస్సేన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో కుటుంబ సభ్యులు, పంచాయతీ ప్రజలు శోకసంద్రంలో మునిగిపోయారు.

కన్నీటి నివాళి..

పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, వైఎస్సార్‌సీపీ నాయకులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, రమేష్ గౌడ్, పసలూరి ఓబిలేసు, రహీమ్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు హుస్సేన్ మృతదేహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

- మేయర్ వసీం



అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా నడుచుకుంటూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది. కడప మేయర్‌ను చులకన చేయడం సరికాదని మేయర్ వసీం ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కడప కార్పొరేషన్‌లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా మేయర్ సీటు పక్కన ఎమ్మెల్యేల కుర్చీలు ఏర్పాటు చేయడం దారుణమన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగానే మేయర్ పక్కన ఎమ్మెల్యే సీటు కావాలంటున్నారన్నారు. స్థానిక సంస్థల హక్కులను టీడీపీ ఎమ్మెల్యేలు కాలరాస్తున్నారన్నారు. కడప మునిసిపల్ కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. నగరపాలక సంస్థలో మేయర్‌కే సర్వాధికారాలుంటాయన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు.

అనంతసిరి కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభం



మహిళలకు చెక్కులు పంపిణీ చేస్తున్న డీఎస్పీ వెంకటేశులు

రాప్తాడు: మండల కేంద్రంలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో అనంతసిరి కో ఆపరేటివ్ బ్యాంక్ ఏర్పాటు చేసుకోవడం గొప్ప విషయమని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు పేర్కొన్నారు. శుక్రవారం రాప్తాడులో అనంతసిరి కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభించారు. ఆర్డీటీ ఉమెన్ డైరెక్టర్ విశాల ఫెర్రర్ మాట్లాడుతూ.. మహిళలు తక్కువ వడ్డీతో రుణాలు తీసుకుని ఆర్థికాభివృద్ధి సాధించడానికి ఈ బ్యాంకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 7 బ్యాంకులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాప్తాడులో 8వ బ్యాంకును ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ఆర్డీటీ సంస్థ మీ వెనుక ఉండి నడిపిస్తుందని.. మహిళలందరూ ధైర్యంగా ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌వైడీటీ డైరెక్టర్ నిరంజన్, కెనరా బ్యాంక్ ఆఫీసర్ వెంకట కృష్ణ, ఆర్డీ లక్ష్మణరావు, ఆర్ఈ జ్యోతి పాల్గొన్నారు.

నాటుసారా రహిత జిల్లాగా మార్చుదాం



మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

అనంతపురం సెంట్రల్: ఉమ్మడి అనంతపురాన్ని నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన చాంబర్‌లో ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నాటుసారా నిర్మూలన, నవోదయం 2.0పై సమీక్షించారు. అనంతపురం జిల్లాలో 104 నాటుసారా ప్రభావిత గ్రామాలుండగా ఇప్పటికే 51 గ్రామాల్లో పూర్తిస్థాయిలో మార్పు తీసుకొచ్చినట్లు వివరించారు. సత్యసాయి జిల్లాలో 53 ఉండగా 38 గ్రామాలు నాటుసారా రహిత గ్రామాలు ప్రకటించినట్లు తెలిపారు. తనకల్లు, మడకశిర ఎక్సైజ్ స్టేషన్‌ల పరిధిలో ఎక్కువశాతం నాటుసారాపై దృష్టి పెట్టి మార్పు తెచ్చినట్లు వివరించారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాటుసారాపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. మద్యం షాపుల్లో ఎమ్మార్పీ ధరల ఉల్లంఘనలు, సమయపాలన, పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో మద్యం అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కల్లు దుకాణాల్లో తరుచూ శాంపిల్స్ సేకరించి కల్తీ జరగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అనంతపురం, సత్యసాయి జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు రామమోహన్‌రెడ్డి, గోవింద్ నాయక్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లు రేవతి, నరసింహులు, ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, జయనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో తనిఖీలు

అనంతపురం సెంట్రల్: జిల్లా ఎస్పీ ఆదేశాలతో నగరంలో ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో సీఐ శాంతిలాల్ నేతృత్వంలో శుక్రవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల బ్యాగులు, అనుమానాస్పద వాటిని జాగిలంతో పరిశీలించారు. గంజాయి, మద్యం అక్రమ రవాణా జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ వివరించారు.

'కార్మికుల బతుకులతో చెలగాటం వద్దు'



మాట్లాడుతున్న వ్యవసాయా కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి

అనంతపురం అర్బన్: కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల పొట్టకొట్టేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో తిరోగమన దిశగా సంస్కరణలు అమలు చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విమర్శించారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.కేశవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు టి.రంగయ్య, గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకుడు వైఎల్ రామాంజనేయులు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన 2014 నుంచి కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని అన్నారు. కార్మికులు సాధించుకున్న చట్టాలన రద్దు చేసి వారికి నష్టదాయకంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ఉపాధి హామీ పథకానికి ఏటా నిధులు తగ్గిస్తూ నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని విమర్శించారు. ఇందులో భాగంగా కొత్త జీఓలను తీసుకొస్తూ వ్యవసాయ కార్మికుల బతుకులతో చెలగాటం ఆడుతోందన్నారు. ఉపాధి పథకంలో 200 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. రోజు కూలీ రూ.700 ఇవ్వాలన్నారు. బడ్జెట్‌లో ఉపాధి పథకానికి రూ.4.60 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జూలై 9వ తేదీన బీకేఎంయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు సంగప్ప, చిన్నరాయుడు, వనజాక్షి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో కలిసి తల్లి అదృశ్యం



చిన్నారులతో అమరవాణి (ఫైల్)

అనంతపురం సెంట్రల్: కుటుంబ కలహాలతో ఓ తల్లి పిల్లలతో సహా అదృశ్యమైంది.

త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపిన వివరాల మేరకు.. ఆర్కే నగర్‌లో కిరణ్ కుమార్, అమరవాణి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి రిత్విక్ (6) పూజ శ్రీ (4) సంతానం. గురువారం రాత్రి 7 గంటల సమయంలో భర్తతో గొడవ పడి లగేజ్ బ్యాగ్ తీసుకుని ఆటోలో వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు అన్ని చోట్ల గాలించినా ప్రయోజనం లేకపోయింది. శుక్రవారం భర్త కిరణ్ త్రీటౌన్ పోలీసులను ఆశ్రయించాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

దాడి ఘటనలో ఇరువర్గాల అరెస్ట్

అనంతపురం సెంట్రల్: నగరంలోని నాల్గవ రోడ్డులో ఈనెల 16న రాత్రి ఇరువర్గాలు దాడులు చేసుకోవడం, మరణాయుధాలతో హత్యాయత్నాలకు పాల్పడిన ఘటనలో ఇరువర్గాలకు చెందిన నిందితులను అరెస్ట్ చేసినట్లు త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. షేక్ ఇమ్రాన్‌బాషా, సల్మాన్ బాషా, షేక్‌దాదాపీర్ మరో వర్గంలో వడ్డే గణేష్, పార్థసారథి, ప్రణీత్‌ను అరెస్ట్ చేసినట్లు వివరించారు. ఇరువర్గాలు గతంలో అనేకసార్లు గొడవలకు పాల్పడ్డారని..పాత గొడవలు మనసులో పెట్టుకొని ఈనెల 16న రాత్రి సమయంలో దాడులకు తెగబడ్డారని తెలిపారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి ముద్దాయిలను అరెస్ట్ చేసి వారి నుంచి ఒక కత్తి, ఇనుపరాడ్డును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా గొడవలు, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రాప్తాడు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చు. రోజూ యోగ చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తహసీల్దార్ విజయకుమారి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ప్రసన్నాయపల్లిలోని ఎల్లార్జీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో యోగాంధ్ర శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. యోగా అనేది మనిషికి ఎంత అవసరమో అందరూ తెలుసుకోవాలన్నారు. యోగా చేయడం వల్ల చిన్న తనం నుంచే పిల్లల్లో క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవడుతుందన్నారు. యోగ సాధనతో పలు రకాల మానసిక ఒత్తిడుల నుంచి విముక్తి పొందడంతో పాటు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయని పేర్కొన్నారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరాలంటే యోగా ద్వారా సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కరుణాకర్, సర్వేయర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



నినాదాలు చేస్తున్న నాయకులు, ఉద్యోగులు

అనంతపురం అర్బన్: ప్రజలు మెచ్చేలా పని చేయాలని రెవెన్యూ ఉద్యోగులకు ఆర్డీఓ జి.కేశవ నాయుడు సూచించారు. రెవెన్యూ డే సందర్భంగా శుక్రవారం స్థానిక కృష్ణ కళామందిర్‌లోని రెవెన్యూ ఉద్యోగుల సంఘం కార్యాలయం వద్ద సంఘం పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రజలకు ఉత్తమ సేవలందిస్తే గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.హరికుమార్, రిటైర్డ్ తహసీల్దార్ పగడాల మల్లికార్జున, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దివాకర్ రావు, నాయకులు శ్రీనివాస మూర్తి, హరిప్రసాద్, సురేఖరావు, భరత్, శ్రీలక్ష్మి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే రెవెన్యూ సేవలు

రాప్తాడు: ప్రజలు, రైతుల ముంగిటకే రెవెన్యూ సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని తహసీల్దార్ విజయకుమారి అన్నారు. శుక్రవారం 'రెవెన్యూ దినోత్సవాన్ని' పురస్కరించుకుని అధికారులు కేక్ కట్ చేశారు.

రాప్తాడు: రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీ వద్ద గర్భిణులకు భోజన వసతి కల్పించారు. తహసీల్దార్ విజయకుమారి, ఆర్ఎస్ డీటీ క్రిష్ణ, డీటీ చెన్నకేశవులు, వైద్యాధికారి శివ కృష్ణ, సీహెచ్ఓ శివప్రసాద్, ల్యాబ్ టెక్నిషియన్ శ్రీధర్ బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ

అనంతపురం కల్చరల్: వివేకానంద యోగ కేంద్రం ద్వారా మరిన్ని ఉచిత సేవలందిస్తున్నట్లు కేంద్రం అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి తెలిపారు. కాశీవిశ్వేశ్వరాలయం, విద్యారణ్య స్కూల్, కమ్మభవన్, శ్రీసరస్వతీ విద్యామందిరం, జెడ్పీ కాంపౌండ్, ఆజాద్ నగర్ తదితర చోట్ల ఉచిత యోగా ఉంటుందన్నారు. 10 ఏళ్ల పైబడిన విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలకు శిక్షణ అందిస్తామని తెలిపారు. మరింత సమాచారం కోసం 9440288899 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.